# శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ రెండవ శాసనసభ (1955-1962) డెప్యూటీ స్పీకర్‌గా 1957, ఏప్రిల్ 16న ఏకగ్రీవంగా ఎన్నికై 1960, జనవరి 11వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు 1915, సెప్టెంబరు 27న ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో జన్మించారు. హైదరాబాదులో మెట్రిక్యులేషన్ పూర్తి అయిన తరువాత ఆర్థిక ఇబ్బందుల కారణంగా వీరు చదువును కొనసాగించలేకపోయారు. అయితే రాత్రి కళాశాలలో చేరి లా కోర్సు పూర్తి చేసి ప్రముఖ న్యాయవాదిగా పేరు పొందారు.

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ 1938 లో జరిగిన పౌరహక్కుల ఉద్యమం మొదటి బృందం సత్యాగ్రహంలో పాల్గొని పుత్లీబౌలి వద్ద అరెస్టయ్యారు. వందేమాతరం ఉద్యమంలోను చురుకైన పాత్ర పోషించారు.

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించి, రాజకీయ ఖైదీలు, విప్లవకారుల తరపున కేసులు చేపట్టి ఎందరికో స్వేచ్ఛను ప్రసాదించి ప్రజాదరణ పొందారు. 1942వ సంవత్సరములో క్విట్ ఇండియా ఉద్యమాన్ని హైదరాబాద్‌లో నడిపారు. రజాకార్ల రక్కసి మూకల నుంచి జాతీయ వాదులకు రక్షణ కల్పించడానికి, పాలకులకు వ్యతిరేకంగా పోరాడటానికి జంటనగరాలలోని వివిధ వాడలలో పౌర రక్షణ సంఘాలను స్థాపించి అధ్యక్షుని హోదాలో వాటిని సమన్వయపరిచారు.

వీరు మొదటిసారిగా 1952వ సంవత్సరంలో ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా ఎన్నికైనారు. 1957 వ సంవత్సరంలో చినకొండూర్ నియోజకవర్గం నుండి ఎన్నికైనారు. వీరు శ్రీ దామోదరం సంజీవయ్య మంత్రి వర్గంలో 1960, జనవరి 11 నుండి 1962, మార్చి 11 వరకు చిన్న తరహా, కుటీర పరిశ్రమలు, అబ్కారీ శాఖ మంత్రిగా పనిచేశారు.

వీరు 1967, 1972 సంవత్సరాలలో నల్గొండ జిల్లా భువనగిరి నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికైనారు. వీరు డెప్యూటీ స్పీకర్ హోదాలో 1957-1958, 1959-1960 సంవత్సరములలో అర్జీల, విశేషాధికారాల కమిటీల అధ్యక్షులుగా ఉన్నారు.

శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో 1967, మార్చి 6 నుండి 1969, జూలై 18 వరకు కార్మిక, సమాచార, ప్రజాసంబంధాలు, పర్యాటక శాఖ మంత్రిగా వీరు పని చేశారు.

రాజకీయాలతో పాటే సాంఘిక ఉద్యమాలను ఏక కాలంలో నడిపిన సవ్యసాచి, అలుపెరుగని యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ గారు.

## శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ డెప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

అధ్యక్షా, ఈ సభకు నన్ను డెప్యూటీ స్పీకరుగా ఏకగ్రీవముగా సభ్యులందరు ఎన్నుకున్నందుకు, వారందరికి నేను హృదయపూర్వకమైన ధన్యవాదములు తెలియజేస్తున్నాను. ఈ సందర్భములో కొందరు మిత్రులు, పెద్దలు నా యొక్క మంచి గుణములు, యోగ్యతలను గురించి చెప్పారు కాని యీ సమయము చెడులను చూపించేది కాదు. ఎప్పుడైతే నేను అధ్యక్ష స్థానములో కూర్చుని సభా కార్యక్రమములను నిర్వహించే అవకాశము నాకు కలుగుతుందో, అట్టి సమయములో నేను చేసే కార్య నిర్వాహణ ఏ మెంబరుకైనా సమాధానముగా వుండేట్లు సాగించలేకపోతే అప్పుడు నాలో వున్న లోపాలు కనిపిస్తాయని నేను అనుకుంటున్నాను. అయితే యీ సమయములో మాత్రము ఎక్కువ లోపాలు నాలో కనబడకుండా నడచుకొనటానికి ప్రయత్నము చేయగలనని నేను సభ్యులందరికీ హామీ ఇస్తున్నాను.

ఇక పోతే, పార్లమెంటరీ వ్యవహారములలో నాకు చాలా అనుభవము ఉన్నదనే విషయము కాదు. కాని అధ్యక్షులవారి అభిప్రాయమును గమనించుకొని నేను తప్పకుండ నా అనుభవమును ఉపయోగించుకునే ప్రయత్నము చేయగలను. నాకు వున్న కొద్ది అవకాశములోనే నేను ఈ కార్యభారమును సభ్యులనుంచి ఏ విధమైన అపోహలు రాకుండా నిర్వహించే అవకాశము కలుగుతుందో లేదో గాని, నేను మాత్రము నా విధులను పక్షపాతము లేకుండ నిర్వహించగలనని నేను మరొకసారి సభ్యులందరికి హామీ యిస్తున్నాను. అయితే ప్రతిపక్ష సభ్యులు వారి యొక్క హక్కులు ఎక్కువగా కాపాడాలని కోరుతున్నారు. వారి హక్కులను కాపాడే ప్రయత్నము నేను చేస్తాను కాని దానితో పాటు Treasury benches లో ఉన్న వారికి నేను కేవలము పక్షపాతముతో Opposition side వారికే ఎక్కువగా సహాయపడుతూ వ్యవహరిస్తున్నానన్న భావము వారిలో కలగనివ్వకూడదని నా అభిప్రాయము. నేను మాత్రము సభ్యులను ఏ పక్షమువారైనను, అందరిని సమాన దృష్టితో న్యాయము కలిగేటట్లు అన్ని విధముల ప్రయత్నము చేస్తాను. ఈ రోజు నన్ను మీరందరు ఏకగ్రీవముగా యీ సభకు డెప్యూటీ స్పీకరు పదవికి ఎన్నుకున్నను, ఈ ఎన్నికలతో సరిపోదు. మీ అందరికి నచ్చేటట్లుగా ఋజువుచేసే ప్రయత్నము నా చర్యలవల్ల చేస్తానని మరొకసారి మీకు తెలియజేస్తూ నన్ను ఏకగ్రీవముగా ఎన్నుకున్నందులకు మీకందరికి నా ధన్యవాదములను తెలియ జేస్తున్నాను.